క్లుప్తంగా

ఆలయాల శుద్ధి



రావిర్యాలలో ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న భక్తులు

తుక్కుగూడ: అయోధ్యలో సోమవారం జరగనున్న శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ వై శివకుమార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠ రోజున ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రెంచ్ నిర్మాణం

చురుకుగా కొనసాగుతున్న పనులు



రావిర్యాల వండర్‌లా రోడ్డులో కొనసాగుతున్న ట్రెంచ్ నిర్మాణ పనులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి వండర్‌లా వచ్చే రహదారికి ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు నిర్వహించి, రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ రోడ్డులో ప్రమాదాలను నివారించేందుకు, మురుగు నీరు పోవడానికి వీలుగా సైడ్ ట్రెంచ్ నిర్మాణ పనులను చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్రెంచ్ పనులు గత కొద్ది రోజుల నుంచి చురుకుగా కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

వయోజనులు ఓటరుగా నమోదు చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



రావిర్యాలలో ఓటర్‌లిస్టును పరిశీలిస్తున్న బిఎల్‌ఓలు

తుక్కుగూడ: జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన వయోజనులందరూ తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి వెంకట్రామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ వ్యాప్తంగా నేటి వరకు నూతన ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

షాద్‌నగర్: దేవునిపల్లి గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. శనివారం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ ఉత్సావాల్లో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, సర్పంచ్ చేగూరి రాఘవేందర్‌గౌడ్, కుమారస్వామి, రాజేందర్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, బసప్ప, నరేశ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్

శంకర్‌పల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పామేన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దొంతాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన అజీజ్ శానిటైజర్, మాస్కులు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, అత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వై ప్రకాష్ గుప్తా, సర్పంచ్ అశ్వినిసుధాకర్, జాన్, మహ్మద్, మహబూబ్, హుస్సెన్, నయిం, బద్దం కృష్ణారెడ్డి, బీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అరికట్టండి

- పెండింగ్ బిల్లులు విడుదలకు సహకరిస్తాం
- మిషన్ భగీరథతో తాగునీటి వెతలు తప్పాయి
- దశలవారీగా బెల్టు షాపులు తగ్గిస్తాం
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: అక్రమంగా చెరువులు, అసైన్డ్ భూముల్లో చేపట్టే మట్టి తవ్వకాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారుల్ని ఆదేశించారు. శనివారం ఎంపీపీ మంద జ్యోతిపాండు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం హాల్లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టా భూముల్లో సైతం చెరువులు, కుంటలు ఉంటే ఎఫ్‌టీఎల్ తప్పకుండా నిర్ధారించాలన్నారు. అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేసి, పీఓటీ కింద తీసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ఐదేళ్లుగా రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించారని ఇకపై కూడా చేయూతనందించాలన్నారు. పల్లె ప్రగతి పనులను సర్పంచులు బాగా చేశారని, వారి అనుభవం ఇకపై కూడా ఎంతో అవసరమన్నారు. పెండింగ్ బిల్లులు విడుదలయ్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. సర్పంచులను కొనసాగించేలా ప్రభుత్వానికి సూచిస్తామన్నారు. మిషన్ భగీరథ పథకం అమలుతో ఐదేళ్లుగా సర్పంచులకు తాగునీటి వెతలు తప్పాయన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ఫార్మాసిటీలో ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చిన వారందరికీ సహాయం చేస్తామన్నారు.

అంశాల వారీగా....

కాగా అంతకుముందు సర్వసభ్య సమావేశంలో అంశాల వారీగా చర్చ నిర్వహించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటైన బెల్టు షాపులు అరికట్టాలని, మట్టి తవ్వకాలపై, రైతు బంధు నిధుల కోసం, ఆధార్ సెంటర్ ఏర్పాటు వంటి తదితర సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచులు ప్రశ్నించారు. ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీడీఓ వెంకట్రాములు, తహసీల్దార్ గోపాల్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



నాణ్యత ప్రమాణాలు పాటించండి



పనులు ప్రారంభిస్తున్న మేయర్ చిగురింత పారిజాతరెడ్డి

మేయర్ పారిజాతరెడ్డి

బడంగ్‌పేట్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతప్రమాణాలు పాటించాలని గుత్తేదార్లను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్ వైకుంఠపురం కాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ నిమ్మల సునితతో మేయర్ పారిజాతరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో సమస్యలు పరిష్కరిస్తూ, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, బంగారి బాబు, సుభాన్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అధికారులతో మేయర్ సమీక్షా సమావేశం

బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని మేయర్ చాంబర్‌లో అధికారులతో మేయర్ పారిజాతరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈలు బిక్కునాయక్, వినీల్‌గౌడ్, ఆర్వో చంద్రశేఖర్, టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి

ఇన్‌చార్జి ఎంఈఓ మనోహర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కందుకూరు: బడుగు, బలహీన వర్గాల పిల్లల బాగు కోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కందుకూరు ఇన్‌చార్జి ఎంఈఓ మనోహర్ సూచించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభను నిర్వహించారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థ బాగు కోసం టీఎస్ యూటీఎఫ్ ముఖ్య భూమిక పోషించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగనాథ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల కల్లేష్, ప్రధానకార్యదర్శి జె.బుగ్గరాములు, ఉపాధ్యక్షుడు ఎల్.జగన్, జి.విజయలక్ష్మీ, కార్యదర్శులు ఈశ్వర్, కుమార్, నజీర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో దేవాలయాలు నిర్మించడం అభినందనీయమన్నారు.

మోడల్ పేపర్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు మోడల్ పేపర్ పుస్తకాలను అందజేస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది



కందుకూరు: పుస్తకాలను పంపిణీ చేసిన నిర్వాహకులు

పహాడీషరీఫ్: సాలారే ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేద విద్యార్థులకు అండగా ఉంటుందని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. మజ్లిస్ పార్టీకి చెందిన ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన మోడల్ పేపర్ పుస్తకాలను శనివారం ఆయన పహాడీషరీఫ్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలను అన్ని విధాలుగా మజ్లిస్ అండగా ఉంటుందన్నారు. సాలారే ఎడ్యుకేషనల్ సొసైటీ, ఓవైసీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీల ద్వారా వేలాది మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దస్తగిర్, నయీం తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల పరిధిలోని ముచ్చర్ల జెడ్పీ పాఠశాలలో శనివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ మరియు ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా కెరియర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ యూనిట్ కోశాధికారిణి పద్మిని, కోఆర్డినేటర్ రిషిఖ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు భవిష్యత్‌లో పదో తరగతి అనేది తమ జీవితంలో ఉన్నత స్థాయిలో ఉంచడానికి దోహదపడుతుందన్నారు. పదో తరగతి తర్వాత ఎంచుకునే గ్రూప్‌ను ఆలోచించి తీసుకోవాలన్నారు. ఇంటర్ అంటే లైఫ్‌కు ఎంటర్ వంటిదన్నారు. జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీజీఆర్ మరియు ఆయిస్టర్ సంస్థలు కెరియర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సీజీఆర్ సంస్థ ప్రతినిధి, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్ విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయిస్టర్ సంస్థ సభ్యులు రిశిక, భువన, అనన్య, ఐశ్వర్య, ఆకాష్, సుమిత్, గోపిచంద్, గణేష్, రాజు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకంతో మేలు

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్ సూచించారు. శనివారం జిల్లేడ్ చౌదరి గూడ మండలం పీర్జాపూర్, ముష్టిపల్లి, రావిర్యాల, జిల్లేడ్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా రూ.10లక్షల వరకు ఉచిత ఆరోగ్య సదుపాయం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీనెల ఉచితంగా 5 కిలోల బియ్యం, గర్భిణి, బాలింతలతోపాటు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, 5 ఏళ్ల లోపు బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారి కోసం అటల్ పెన్షన్ పథకం వంటి ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఎంపీహెచ్ఈఓ ప్రభులింగం, ఏఈఓ రాజేశ్వరి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్



కేఎల్ఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న ఉద్యమకారులు

తుక్కుగూడ: తెలంగాణ ఉద్యమ కారులకు తాము అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పేర్కొన్నారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఉద్యమ కారులు బీఆర్ఎస్ నుంచి శనివారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో ఉద్యమ కారుల పోరటం వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, గోగికర్ జానకీరామ్, ధనుంజయ్, పార్టీలో చేరిన వారిలో పద్మ, శ్రీను, రాజశేఖర్‌రెడ్డి, దేవేందర్, భాస్కర్, రాజేష్, రాజు, లక్ష్మమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు ఆట పాటలు, భజనలతో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజలు చేశారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, లక్ష్మణ్, క్యాసెట్ శ్రీనివాస్, రమేశ్, రఘునందన్ రెడ్డి, కిషన్ నాయక్, నారాయణ, జనార్ధన్‌రెడ్డి, పద్మా, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జేపీదర్గా ఉర్సు



కొండల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, నాయకులు

దర్గాను దర్శించుకున్న సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కొండల్‌రెడ్డి, ఎమ్మెల్యే

కొత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం ముగిసింది. చివరి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి బాబాను దర్శించుకున్నారు. అనంతరం బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో దర్గా అభివృద్ధి జరగలేదన్నారు. దర్గా హుండీ టెండర్ల నుంచి వక్ఫ్ బోర్డుకు ప్రతీ సంవత్సరం రూ. కోట్లల్లో ఆదాయం సమకూరేదన్నారు. అయినప్పటికీ ఈ దర్గాను మాత్రం అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి గతపాలకులనుద్దేశించి విమర్శించారు. ప్రతీసంవత్సరం ఉర్సు ఉత్సవాలకు స్థానికులే కాకుండా ఆయా రాష్ట్రాలకు చెందిన వేల మంది భక్తులు హాజరవుతుంటారని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు నాయకులు కొండల్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, కాశీనాథ్‌రెడ్డి, జమ్రుద్‌ఖాన్, విశాల, వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన ప్రారంభమెప్పుడో?

- ఏడాది క్రితమే నిర్మాణం పూర్తి
- కరెంటు కనెక్షన్ లేక ప్రారంభించని వైనం
- పట్టించుకోని అధికారులు



చిలుకూరులోని పల్లె దవాఖాన

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని నిర్మించిన పల్లె దవాఖాన ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదు. ఈ సాకుతో అధికారులు దవాఖాన ప్రారంభించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో సంవత్సర కాలంగా కొత్త ఈ దవాఖాన తెరుచుకోవడం లేదు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరులో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఓ చిన్న గదిలో సబ్‌సెంటర్‌ను నిర్వహించేవారు. రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌సెంటర్ కోసం కొత్త భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. దీని కోసం నిధులు కూడా మంజూరు చేసింది. చిలుకూరు బస్టాప్ పక్కనే విశాలమైన ప్రదేశంలో సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది గడిచినా ఇప్పటి వరకు దాన్ని ప్రారంభించడంలేదు.

నిధుల కొరత..

చిలుకూరులో పల్లె దవాఖాన పేరుతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి కరెంటు కనెక్షన్ ఇవ్వడంలేదని, అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందులో కరెంటు ఫిట్టింగ్ చేయలేదు. ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆరు నెలల క్రితం జిల్లా వైద్యాధికారి చిలుకూరు పల్లె దవాఖాన భవనాన్ని పరిశీలించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఐనప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో మండల ప్రజలు ఈ ఆరోగ్యకేంద్రం ఎప్పుడు ప్రారంభమవుతుందోనని అధికారులను ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం దీన్ని పట్టించుకుంటుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.